క్లుప్తంగా

జగన్మాతకు ప్రత్యేక పుష్పార్చన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో నిర్వహిస్తున్న చైత్రమాస వసంత నవరాత్రోత్సవాలు ఆరో రోజుకు చేరుకున్నాయి. శుక్రవారం దుర్గమ్మకు కాగడా మల్లెలు, మల్లెలు, జాజులు, మరువంతో ప్రత్యేక పుష్పార్చన చేశారు. తొలుత రాజగోపురం నుంచి అమ్మవారికి అర్చన నిర్వహించే పుష్పాలను ఆలయ అధికారులు, అర్చకులు, సేవా సిబ్బంది మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ప్రధాన ఆలయానికి ఊరేగింపుగా తీసుకొచ్చారు. పూజా మండపంలో ఉత్సవ మూర్తికి పుష్పార్చన జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు.

నవమి వేడుకలు ప్రారంభం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పాలప్రాజెక్టు సమీపంలోని శ్రీ విజయదుర్గా రామలింగేశ్వర స్వామి సన్నిధిలో శుక్రవారం శ్రీరామ నవమి వేడుకలను శాస్త్రోక్తంగా ప్రారంభించారు. ఉదయం సీతారామ, లక్ష్మణ, దాసాంజనేయ స్వామి మూర్తులను మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఆలయానికి ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఆలయ ప్రాంగణంలో ఉత్సవ మూర్తులకు సంప్రోక్షణ, గణపతి పూజ, పుణ్యహవచనం, పంచగవ్యప్రాసన జరిగాయి. అనంతరం ఉత్సవమూర్తులకు కంకణ ధారణను ఆలయ అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి, పవన్‌కుమార్ శర్మ జరిపించారు. అనంతరం పంచామృత అభిషేకాలు చేయగా, పలువురు ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన




ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొండపల్లికి చెందిన కళాబృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై శుక్రవారం సాయంత్రం అమ్మవారికి పంచహారతుల సేవ అనంతరం నృత్య ప్రదర్శన ప్రారంభమైంది. నృత్య కళాకారిణి దాము చరిష్మాదేవి పర్యవేక్షణలో 20కి పైగా కళాబృంద సభ్యులు పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన చేశారు. నృత్య ప్రదర్శన అనంతరం కళాబృందానికి అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు ప్రసాదాలను అందించారు.

7న నగరాల సీతారాముని రథోత్సవం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కొత్తపేట శ్రీ నగరాల సీతారామస్వామి దేవస్థానం ఆధ్వర్యాన శ్రీరామనవమి మహోత్సవాలను పురస్కరించుకొని ఈ నెల ఏడో తేదీ రథోత్సవాన్ని నిర్వహించనున్నట్లు అమ్మవారి దేవస్థానం కమిటీ అధ్యక్షుడు లింగిపిల్లి అప్పారావు, కార్యదర్శి మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు (పీసీ) చెప్పారు. ఈ సందర్భంగా శుక్రవారం రామాలయం కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. కొత్తపేట బ్రాహ్మణవీధిలోని శ్రీ నగరాల సీతారామస్వామి వారి బ్రహ్మోత్సవాలను ఈ నెల తొమ్మిదో తేదీ వరకూ వైభవంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. శ్రీరామనవమి సందర్భంగా ఆరో తేదీన మధ్యాహ్నం 12 గంటలకు సీతారామస్వామి వారి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరుగుతుందని చెప్పారు. ఏడో తేదీ సాయంత్రం ఆరు గంటలకు రథోత్సవం నగర పురవీధుల్లో జరుగుతుందని వివరించారు. సమావేశంలో దేవస్థానం కమిటీ ఉపాధ్యక్షులు మరుపిళ్ళ సత్యనారాయణ, బెవర శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి శీరం వెంకటరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కొరగంజి భాస్కరరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా కోదండరాముని ధ్వజారోహణం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీకన్యకాపరమేశ్వరి శ్రీనగరేశ్వరస్వామి శ్రీ రామ దేవస్థానం (కొత్త గుళ్లు) ప్రాంగణంలోని కొలువై ఉన్న శ్రీ కోదండరామ స్వామి కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ధ్వజారోహణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామి వారి కల్యాణోత్సవానికి అందరినీ ఆహ్వానించడానికి ఈ వైదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తామని అర్చకులు తెలిపారు. సంతానం లేని వారికి, ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి గరుడ స్వామి ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అంతరాలయంలోని సీతా, లక్ష్మణ సమేత శ్రీ కోదండరామస్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు

నేత్రపర్వంగా హంసవాహన సేవ

శుక్రవారం సాయంత్రం ఆలయంలో స్వామి వారి సన్నిధిలో హంసవాహనోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహించారు.

అతిక్రమణ.. ఆక్రమణ



ఏలూరు లాకుల నుంచి స్టేషన్‌లోకి వెళ్లే రహదారి

- ఫుట్‌పాత్‌లపై యథేచ్ఛగా చిరువ్యాపారులు
- స్టేషన్ ప్రధాన రహదారిలోనే ద్విచక్రవాహనాల పార్కింగ్
- ప్రయాణికుల ఇబ్బందులు



స్టేషన్ రోడ్డులో ఫుట్‌పాత్ ఆక్రమణ

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): నగరంలోని రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలు ఆక్రమణలకు గురవుతున్నాయి. దీంతో స్టేషన్‌లోకి వచ్చిపోయే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా స్టేషన్ ప్రధాన ప్రవేశ మార్గాలు ఉన్న తూర్పు వైపున స్టేషన్‌కి వచ్చే రహదారిలోని ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురయ్యాయి. ప్రయాణికులు నడక మార్గంలో రాకపోకలకు ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లపై కొందరు చిరువ్యాపారులు బడ్డీకొట్లు, తోపుడు బండ్లు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు సాగిస్తున్నారు. ప్రయాణికులు నడవడానికి వీల్లేకపోవడంతో ప్రమాదకరంగా రోడ్డుపై నుంచి లగేజీలను మోసుకుంటూ రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది.

రైల్వే పోలీసులు దృష్టి సారించాలి

రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలు ఆక్రమణలకు గురవుతుంటే వాటిని అడ్డుకోవాల్సిన ఆర్‌పీఎఫ్, రైల్వే పోలీసులు దృష్టి సారించకపోవడంపై ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వీఐపీలు స్టేషన్‌కు వచ్చే సందర్భాల్లో హడావుడి చేసి అనధికార హాకర్లు, పార్కింగ్‌లను అడ్డుకునే ఆర్‌పీఎఫ్ సిబ్బంది ఇతర వేళల్లో తమకు పట్టనట్లు వ్యవహరించడంపై వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రైల్వే ఉన్నతాధికారులు స్పందించి స్టేషన్ పరిసరాల్లో రోడ్లు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకుంటున్న వ్యాపారులు, అనాధికారిక పార్కింగ్‌లను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డుపైనే ద్విచక్ర వాహనాల పార్కింగ్



స్టేషన్‌కు వెళ్లే దారిలో రోడ్డుపైనే అనధికార పార్కింగ్

తూర్పు ప్రవేశ ద్వారం నుంచి స్టేషన్‌లోకి వచ్చిపోయే రహదారిలో ఒకవైపు ఫుట్‌పాత్‌లను ఆక్రమించడంతోపాటు రైల్వే హాస్పటల్ ఎదుట అనాధికారికంగా రోడ్డుపైనే వాహనాలను అడ్డదిడ్డంగా పార్కింగ్ చేస్తున్నారు. ఇక్కడ ఆస్పత్రి ప్రాంగణంలో వాహనాలను నిలిపే అవకాశమున్నా వాహనచోదకులు బయటే నిలుపుతున్నారు. స్టేషన్‌లోకి వచ్చిపోయే వాహనాలు, నడక మార్గంలో వచ్చే ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ప్రమాదాలు జరుగుతున్న ఘటనలు ఉంటున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. ముఖ్యంగా ఏలూరు లాకుల నుంచి స్టేషన్‌కు వెళ్లే దారిలో ఆక్రమణలు అధికంగా ఉండటంతో ద్విచక్ర వాహనాలు, కార్లలో వచ్చే ప్రయాణికులు అక్కడ నెలకొంటున్న ట్రాఫిక్ సమస్య కారణంగా ఇబ్బంది పడుతున్నారు.

ఫుట్‌పాత్‌పై నడిచే వీల్లేదు



ఫుట్‌పాత్‌ను ఆక్రమించుకుని కొంతమంది వ్యాపారాలు చేసుకుంటున్నారు. లగేజీలను మోసుకుంటూ వాహనాల రాకపోకల మధ్య రోడ్డు మీదుగా ప్రమాదకర పరిస్థితిలో స్టేషన్‌లోకి రాకపోకలు సాగించాల్సి వస్తోంది. అధికారులు దీనిపై దృష్టి పెట్టి ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలను తొలగించాలి.

– కె.శ్రీనివాసరావు, ప్రయాణికుడు

ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్



పెద్ద సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగించే స్టేషన్ ప్రధాన రహదారిలో రోడ్డుపైనే అడ్డంగా వాహనాలను పార్కింగ్ చేయడంతో ఇబ్బందిగా ఉంటోంది. ఒక్కోసారి తమ వాహనాలు కూడా రోడ్డుపైనే నిలిచిపోవాల్సిన పరిస్థితి నెలకొంటోంది. రైల్వే ఉన్నతాధికారులు స్పందించి స్టేషన్ ప్రధాన రహదారిలో ఆక్రమణలు తొలగించాలి.

– దాసరి ఏసు, ప్రయాణికుడు

వైభవంగా శోభాయాత్ర



విద్యాధరపురంలో శోభాయాత్రలో భక్తులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): శ్రీవైష్ణవ మహా దివ్య క్షేత్ర సంఘం ఆధ్వర్యాన ఈ నెల 7 నుంచి ప్రారంభం కానున్న శ్రీవారి వైభవోత్సవ సహిత హనుమాన్ చాలీసా సమాపనోత్సవాలు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ శుక్రవారం నిర్వహించిన శోభాయాత్ర వైభవంగా జరిగింది. విద్యాధరపురంలోని అష్టాక్షరి రామాలయం నుంచి ప్రారంభమైన యాత్ర నాలుగు స్తంభాల సెంటర్, జోజినగర్, భవానీపురం స్వాతి రోడ్ మీదుగా ఉత్సవాలు జరిగే బబ్బూరి గ్రౌండ్‌కు చేరుకుంది. శ్రీవైష్ణవ మహా దివ్య క్షేత్ర సంఘం కార్యదర్శి దూపగుంట్ల శ్రీనివాసరావు జెండా ఊపి యాత్రను ప్రారంభించగా వందలాది మంది భక్తులు హనుమాన్ జెండాలను చేతబూని శోభాయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణానదీ తీరాన భవానీపురంలోని బబ్బూరి గ్రౌండ్‌లో ఈ నెల 7 నుంచి 13 వరకు హనుమాన్‌చాలీసా పారాయణ నిర్వహించనున్నట్లు తెలిపారు. పెనుమాకలో తమ క్షేత్రంలో జరిగిన చాలీసా అఖండ పారాయణ ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని ఈ ఉత్సవాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. దీనికి కృష్ణాతీరంలో తిరుమల తరహాలో శ్రీవేంకటేశ్వరస్వామి నమూనా ఆలయాన్ని నిర్మించి తిరుమలలోని స్వామివారి సన్నిధిలో జరిగే ఉదయాస్తమాన సేవలన్నింటినీ యథావిధిగా ఇక్కడ నిర్వహించనున్నామని వివరించారు. శోభాయాత్రలో సంఘ ప్రతినిధులు ఆలపాటి సుందరరావు, కొప్పురావూరి శ్రీమన్నారాయణ, బాలగంగాధర్, కోటేశ్వరరావులతోపాటు శ్రీవారి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సమయాన్ని వినియోగించుకుంటే విజయమే..

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): సమయం చాలా విలువైందని దీన్ని వినియోగించుకుంటే విజయం వరిస్తుందని ది టైమ్స్ గ్రూప్ సీఈఓ శివకుమార్ సుందరం చెప్పారు. పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల 50 వ వార్షిక దినోత్సవం సిద్ధార్థ ఆడిటోరియంలో శుక్రవారం సాయంత్రం జరిగాయి. ఈ సందర్భంగా సుందరం మాట్లాడుతూ తాను సిద్ధార్థ కళాశాల పూర్వ విద్యార్థినని చెప్పారు. జీవితంపై ప్రతి ఒక్కరికి స్పష్టమైన దృక్పథం ఉండాలని, దీనికి నైపుణ్యం తోడైతే అపారమైన ఉపాధి అవకాశాలు వెతుక్కుంటూ వస్తాయని చెప్పారు. కాలేజీ ప్రిన్సిపాల్ ఎం.రమేష్ మాట్లాడుతూ సిద్ధార్థ అకాడమీ 50 సంవత్సరాల సుదీర్ఘ కాలంలో 18 విద్యాసంస్థలను నిర్వహిస్తోందన్నారు. అనంతరం శివకుమార్ సుందరంను సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రటరీ నిమ్మగడ్డ లలితప్రసాద్, కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, డీన్ రాజేష్ జంపాల సత్కరించారు.

అధ్యాపకులకు బహుమతులు

సభ అనంతరం బెస్ట్ విభాగం పురస్కారాన్ని కంప్యూటర్ విభాగాధిపతి డాక్టర్ టీఎస్.రవికిరణ్, బెస్ట్ సపోర్టింగ్ స్టాఫ్ అవార్డులను సుధీర్, కృష్ణారావులకు, ఉత్తమ అధ్యాపకురాలు అవార్డును ఆంగ్ల శాఖాధిపతి శ్రీలతకు అందజేశారు.

మారుతున్న పరిస్థితులపై పట్టు సాధించాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మారుతున్న పరిస్థితులపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ శరవణకుమార్ చెప్పారు. ఆ కళాశాల మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు 'మార్కెట్ మేకర్స్' అంశంపై పోటీని నిర్వహించారు. ఈ సందర్భంగా శరవణకుమార్ మాట్లాడుతూ మేనేజ్‌మెంట్ స్టడీస్ విద్యార్థులు మార్కెటింగ్ రంగాలపై అవగాహన పెంచుకోవడంతో మంచి విజయాలను అందుకోవచ్చన్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నైపుణ్యం పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ ఎస్ మణికంఠ, అధ్యాపకులు ప్రవీణ్, డాక్టర్ వి.విజయదుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

• వివాదాస్పదంగా .. బ్యానర్ ఏర్పాటు



గురువారం రాత్రి వైఎస్సార్ విగ్రహానికి ముందు ఏర్పాటు చేసిన బ్యానర్



శుక్రవారం మధ్యాహ్నం బ్యానర్ తొలగిస్తున్న కార్పొరేషన్ సిబ్బంది



శుక్రవారం సాయంత్రం విగ్రహానికి కొంచెం ముందు మళ్లీ ఏర్పాటు చేస్తున్న బ్యానర్

భవానీపురం శివాలయం సెంటర్‌లో గురువారం వైఎస్సార్ కాంస్య విగ్రహం ఎదుట టీడీపీ మాజీ కార్పొరేటర్ యేదుపాటి రామయ్య బ్యానర్ ఏర్పాటు చేయడం వివాదాస్పదంగా మారింది. రామయ్య పుట్టిన రోజు సందర్భంగా రాత్రికిరాత్రి బ్యానర్ ఏర్పాటుచేశారు. దీన్ని గమనించిన వైఎస్సార్ సీపీ నేతలు భవానీపురం సీఐకి సమాచారమిచ్చారు. అయినా బ్యానర్ తీసేయలేదు. దీనిపై వైఎస్సార్ సీపీ క్లస్టర్ అధ్యక్షుడు కేసరి కృష్ణారెడ్డి, డీవీ రెడ్డి మరి కొందరు సీఐని కలిసి పరిస్థితిని వివరించారు. ఆయన ఉన్నతాధికారులకు ఫోన్‌లో సమాచారమిచ్చారు. పార్టీ పశ్చిమ సమన్వయకర్త వెలంపల్లి దృష్టిలో పెట్టారు. శుక్రవారం మధ్యాహ్నం వీఎంసీ సిబ్బంది బ్యానర్ తొలగిస్తే, సాయంత్రానికి మళ్లీ ఏర్పాటుచేశారు. వివాదాలకు తావులేకుండా పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని వైఎస్సార్ సీపీ నేతలు కోరుతున్నారు. –గాంధీనగర్(విజయవాడసెంట్రల్)

ముస్లింల ఆత్మాభిమానం మోదీకి తాకట్టు

వైఎస్సార్ సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు షేక్ ఆసిఫ్



పంజా సెంటర్‌లో ముస్లింల ప్రదర్శనలో ఆసిఫ్, ఇతర నేతలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): చంద్రబాబునాయుడు వక్ఫ్ బిల్లుకు మద్దతు ఇచ్చి ముస్లింల ఆత్మాభిమానాన్ని ప్రధాని మోదీకి తాకట్టు పెట్టారని వైఎస్సార్ సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు షేక్ ఆసిఫ్ అన్నారు. వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా వివిధ ముస్లిం ప్రజాసంఘాలు, రాజకీయ పక్షాల సంయుక్త ఆధ్వర్యాన శుక్రవారం స్థానిక పంజా సెంటర్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా షేక్ ఆసిఫ్ మాట్లాడుతూ చంద్రబాబు ద్రోహాన్ని ముస్లింలు క్షమించరని ఆగ్రహం వ్యక్తం చేశారు. వక్ఫ్‌బిల్లుకు వ్యతిరేకంగా జగన్‌మోహన్‌రెడ్డి తన ఎంపీల ద్వారా పార్లమెంట్‌లో గళం వినిపించారన్నారు.
సీపీఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్యబాబు మాట్లాడుతూ మోదీ, చంద్రబాబు కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తున్నారన్నాని విమర్శించారు. ఎంసీపీఎం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఖాదర్‌బాషా మాట్లాడుతూ ఢిల్లీ రైతాంగా పోరాటాన్ని ఆదర్శంగా తీసుకొని వక్ఫ్‌బిల్లుపై పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఐఎం నాయకులు సమీర్, ఎంసీపీఐ(యు) రాష్ట్ర నేత సలీమ్, ఏపీ హిస్టరీ బోర్డు మాజీ సభ్యుడు వాజీద్‌ఖాన్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. తొలుత ముస్లింలు వించిపేట షాహీ మసీదు నుంచి ప్రదర్శనగా పంజా సెంటర్‌కు చేరుకున్నారు.

జై భవానీ.. జైజై భవానీ

దుర్గమ్మకు విశేష సేవలు



పల్లకీ సేవలో ఉభయదాతలు, భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మకు శుక్రవారం పలు విశేష సేవలు జరిగాయి. సాయంత్రం అమ్మవారికి పంచహారతుల సేవ, పల్లకీ సేవ, దర్బారు సేవలు నిర్వహించగా పెద్ద ఎత్తున భక్తులు, ఉభయదాతలు పాల్గొని తరించారు. సాయంత్రం 6 గంటలకు అమ్మవారికి పంచహారతుల సేవ చేయగా పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలో అమ్మవారి ఉత్సవమూర్తికి పూజా కార్యక్రమాలను నిర్వహించిన తర్వాత పల్లకీ సేవ జరిగింది. పల్లకీపై ఆది దంపతులు కొలువుదీరగా, మేళతాళాలు, మంగళవాయిద్యాల మధ్య అమ్మవారి ఆలయం చుట్టూ మూడు ప్రదక్షిణలు చేశారు.
అనంతరం పూజా మండపంలో అమ్మవారికి దర్బారు సేవ జరిగింది. గత శనివారం నుంచి శుక్రవారం వరకు ఆలయంలో జరిగిన విశేష సేవలు, ఆదాయ, వ్యయాలను అమ్మవారికి ఆలయ అర్చకులు వివరించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు అన్ని క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి. సర్వదర్శనంతో పాటు రూ.100, రూ.300, రూ.500 టికెటు క్యూలైన్‌లో అమ్మవారి దర్శనం గంటలోపే పూర్తయింది.

ఉపాధి లభించే కోర్సులు ప్రారంభించాలి

కళాశాల విద్య డైరెక్టర్ భరత్‌గుప్తా

మధురానగర్(విజయవాడసెంట్రల్): రాబోయే విద్యా సంవత్సరంలో ప్రతి డిగ్రీ కళాశాలలో అప్రెంటిషిప్ ఏంబాడెడ్ డిగ్రీ కోర్సులను ప్రారంభించాలని కళాశాల విద్య డైరెక్టర్ డాక్టర్ నారాయణ భరత్‌గుప్తా ఆదేశించారు. మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం కమిషనరేట్ ఆఫ్ కాలేజి ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో సెక్టార్ స్కిల్ కౌన్సిల్స్, ప్రిన్సిపాల్స్, అకడమిక్ కో ఆర్డినేటర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ విద్యార్థికి ఉపాధి లభించే కోర్సులను అందించాల్సిన బాధ్యత కళాశాలలపై ఉందన్నారు. కావున అప్రెంటిషిప్ ఏంబాడెడ్ డిగ్రీ కోర్సులను ప్రారంభించాలని సూచించారు. సెక్టార్ స్కిల్స్ కౌన్సిల్ సెంటర్ ఫర్ రీసెర్చ్ స్కీమ్స్ అండ్ పాలసీ వారు కోర్సుల వివరాలు ఫీజు గురించి వివరించారు. ఈ కోర్సుల ద్వారా ప్రతి విద్యార్థికి ఉపాధి లభిస్తుందన్నారు. 7 స్కిల్ కోర్సులను 2025–26 విద్యా సంవత్సరానికిగాను 47 ఐడెంటిపై ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలలో ప్రారంభించడానికి ఓరియంటేషన్ ఇచ్చారు. ఇందులో భాగంగా 47 కళాశాలల ప్రిన్సిపాల్‌లు , అకడమిక్ కోఆర్డినేటర్లు వారి కళాశాలలో ఎలాంటి కోర్సులు ఆఫర్ చేయవచ్చు, వాటి ఫీజు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం డిమాండ్ ఉన్న ఉపాధి ఆధారిత బీఎఫ్ఐఎస్, ఎలక్ట్రానిక్స్, లాజిస్టిక్స్, లైఫ్ సైన్సెస్, రిటైల్ ఆపరేషన్స్, మేనేజ్‌మెంట్ ఎంటర్‌పెన్యూర్ షిప్ కోర్సులను విద్యార్థులకు తెలియ చేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల విద్య జాయింట్ డైరెక్టర్ కృష్ణ , ఎస్ఆర్ఆర్ అండ్ సివిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

లోబ్రిడ్జిలో నిలిచిన మురుగునీరు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): లోబ్రిడ్జిలో భారీగా నీరు నిలిచిపోయింది. శుక్రవారం తెల్లవారుజామున భారీ వర్షం కురవడంతో లోబ్రిడ్జి దిగువన ఉన్న డ్రైనేజీ వ్యవస్థలో చెత్త అడ్డుపడి మోటర్లు వేసినా నీరు బయటకు వెళ్లలేదు. దాంతో తెల్లవారుజాము నుంచి పది గంటలకు పైగా వర్షపునీటితో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడ్డాయి. లోబ్రిడ్జిలో నీరు నిలిచిన విషయం తెలుసుకున్న వీఎంసీ సిబ్బంది హుటాహుటిన అక్కడకు చేరుకొని సీవియజ్ జెట్టింగ్ యంత్రాన్ని ఉపయోగించి చెత్తను తొలగించారు. అనంతరం నీటిని బయటకు పంపింగ్ చేశారు.

కౌంటర్ కేసుల నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ప్రార్థనా మందిరం వ్యవహారంలో పరస్పర దాడులకు పాల్పడిన వేర్వేరు వర్గాలపై కొత్తపేట పోలీసులు శుక్రవారం కౌంటర్ కేసులు నమోదు చేశారు. కొత్తూరు తాడేపల్లి గ్రామంలోని చర్చి సంఘం కమిటీ ఎన్నికలు జరపాలని నిర్ణయించారు. రెండు వేర్వేరు వర్గాలు సమావేశం కాగా ఒకరిపై మరో వర్గం దాడులకు పాల్పడ్డాయి. దీంతో మానికొండ రాంబాబు ఫిర్యాదు మేరకు కొవ్వూరు సువర్ణరాజు, మానికొండ నాగేశ్వరరావు, పున్నయ్య, కుక్కమళ్ల సాంబయ్య, రమేష్, బాబు, అంజయ్య స్వామిపై కేసు నమోదు చేశారు.
- దొండపాటి వంశీ, కిశోర్, కల్యాణ్, మానికొండ రాంబాబు, శేఖర్, చిన్నబ్బాయి, లిండాలి కల్యాణ్, సురేష్.. కుర్చీలతో తమపై దాడి చేశారని కొవ్వూరు సువర్ణ రాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కమిషనరేట్ పరిధిలో నిషేధాజ్ఞలు

విజయవాడస్పోర్ట్స్: శాంతిభద్రతల పరిరక్షణ నిమిత్తం ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బీఎన్ఎస్ఎస్ 163 ప్రకారం నిషేధాజ్ఞలు విధించినట్లు జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాజా ఉత్తర్వుల ప్రకారం ఈనెల 4వతేదీ శుక్రవారం నుంచి మే 23వ తేదీ వరకు ఈ నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయని స్పష్టం చేశారు. ఇబ్రహీంపట్నం, భవానిపురం, వన్ టౌన్, టూటౌన్, సత్యనారాయణపురం, అజిత్‌సింగ్‌నగర్, నున్న, గవర్నర్‌పేట, సూర్యారావుపేట, కృష్ణలంక, మాచవరం, గుణదల, పటమట పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ఈ నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయన్నారు. ఈ ప్రాంతాల్లో ఐదుగురు, అంతకు మించి ఎక్కువ మంది జనం బహిరంగ ప్రదేశాలలో గుమిగూడరాదన్నారు. కర్రలు, రాళ్లు, ఇతర మారణాయుధాలు పట్టుకుని తిరగరాదని ఆదేశించారు. నిబంధనలను అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

పార్టీ పటిష్టానికి కృషి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పదవుల్లో నియమితులైన నేతలు పార్టీ పటిష్టానికి కృషి చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. నియోజకవర్గంలోని క్లస్టర్ అధ్యక్షుడు బొండా నిరీష్, వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు ఉండేల శ్రీనివాసరెడ్డి, బోర్ల మల్లేశ్వరరెడ్డి తదితరులు వెలంపల్లి శ్రీనివాసరావును ఆయన కార్యాలయంలో శుక్రవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడు తూ పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి, చంద్రబాబు ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరించడానికి పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు శిరంశెట్టి పూర్ణచంద్రరావు, చైతన్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్యరంగంలో 'స్టెమ్ సెల్స్' పాత్ర కీలకం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): అనేక వ్యాధుల చికిత్సలో స్టెమ్‌సెల్స్ విప్లవాత్మక పాత్ర పోషిస్తున్నాయని, అవయవ పునరుద్ధరణలో వీటి పాత్ర కీలకమని ప్రభుత్వ వైద్యకళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్ దుర్గాశ్రీలక్ష్మి అన్నారు. కేబీఎన్ కళాశాల బయోటెక్నాలజీ, ఎన్ఎస్ఎస్ విభాగాల సంయుక్త నిర్వహణలో శుక్రవారం స్టెమ్‌సెల్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ దుర్గాశ్రీలక్ష్మి మాట్లాడుతూ రక్త సంబంధిత వ్యాధులు, న్యూరోడిజెనరేటివ్ సమస్యలు, గుండె సంబంధిత వ్యాధుల చికిత్సకు స్టెమ్‌సెల్స్ ఉత్తమ పరిష్కారాలు అందిస్తాయన్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పీఎల్ రమేష్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై అవగాహన, శ్రద్ధ కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ ఎన్.సాంబశివరావు, శాంతిబాబు, గౌతమీదేవి, జీ సీతారత్నం, బయోటెక్నాలజీ విభాగాధిపతి మౌనిక పాల్గొన్నారు.

క్రెడాయ్ నగర శాఖ కార్యవర్గం ఎంపిక



లబ్బీపేట(విజయవాడతూర్పు): క్రెడాయ్ నగర శాఖ 2025–27కు నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. గురునానక్‌కాలనీలోని ఓ కల్యాణ మండపంలో జరిగిన ఎన్నికల్లో చైర్మన్‌గా చెరుకూరి సతీష్, అధ్యక్షుడిగా జి. రామ్మోహనరావు, ఉపాధ్యక్షులుగా బి.పవన్‌కుమార్, కె.రమేష్ అంకినీడు, శివన్నారాయణ ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా కె.రఘురాం, జాయింట్ సెక్రటరీలుగా మండవ సుధాకర్, టి.నాగభూషణం, షమీఉద్దీన్ రజా, కోశాధికారిగా జి.సాయిరామ్‌ను ఎన్నుకున్నారు. పలువురిని కో ఆప్టెడ్ ఈసీ సభ్యులుగా ఎన్నుకున్నారు. బాధ్యతల స్వీకార కార్యక్రమంలో నాగమల్లేశ్వరరావు ఇన్‌స్టాలేషన్ అధికారిగా వ్యవహరించారు.